

రుణమాఫీకి గ్రీన్‌సిగ్నల్

● రైతుల రుణమాఫీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ ● జిల్లాలో మెజార్టీ రైతులకు వర్తింపు

- జిల్లాలో లక్షన్నరకు పైగా రైతులకు మాఫీకానున్న రుణాలు
- వ్యవసాయ, సహకార శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల వారీగా నిర్ధారణ
- రెండులక్షల రుణం తీసుకున్న రైతులందరికీ మాఫీ
- 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 లోపు రుణాలకు వర్తింపు

నిజామాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఈ రుణమాఫీపై ప్రభుత్వం గైడ్‌లైన్స్‌ను విడుదల చేసింది. జిల్లాలోని బ్యాంకుల వారీగా లిస్టులను తయారు చేసి ఈ రుణమాఫీని వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులో అధికారులు పేర్కొన్నారు. రుణమాఫీని రైతులకు ఊరట కలిగించేందుకు చేస్తున్నట్లు తెలపడంతో పాటు కొత్త రుణాలు మళ్లీ తీసుకునేందుకు ఉపయోగపడుతుందని ఉత్తర్వులో స్పష్టం చేశారు. రుణమాఫీ వల్ల జిల్లాలోని లక్షన్నరకు పైగా రైతులకు మేలు జరిగే అవకాశం ఉందని బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రుణాలు తీసుకున్న వారిలో ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులే ఉండటంతో మెజార్టీ రైతులకు ఉపయోగపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులందరికీ వర్తింపు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పంటల రుణమాఫీపై ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి రఘునందన్‌రావు ఈ ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంతో పాటు జిల్లాలో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులందరికీ వర్తింపజేస్తామని ఉత్తర్వులో పేర్కొన్నారు. రైతులపై రుణభారం అధికంగా పడకుండా ఉండేందుకే ఈ రుణమాఫీని చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రతి రైతుకు ఉన్న రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు అందులో స్పష్టం చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం రుణమాఫీ కాగానే రైతులు కొత్త రుణాలు తీసుకునేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడి కోసం ఎక్కువ అప్పులు తెచ్చుకోకుండా ఉండేందుకు ఈ రుణమాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత భూమి కలిగి ఉన్న ప్రతి రైతుకు ఈ రుణమాఫీ వర్తిస్తుంది. జిల్లాలో, రాష్ట్రంలో షెడ్యూల్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రుణాలకు ఈ పంట రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లాలో 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు పంటరుణాలు తీసుకొని బకాయిలు ఉన్న రైతులందరికి ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల వరకు వర్తింపజేస్తామని ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో రుణమాఫీ కార్యక్రమం చేపడుతామని అందులో పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన రుణాలను మొత్తాన్ని ఆధార్, పాస్‌బుక్‌తో పాటు ఆహార భద్రత కార్డు ద్వారా గుర్తించి అర్హులైన రైతులందరికి వర్తింపజేస్తామని తెలిపారు. ఈ రుణమాఫీ సంస్థలకు, కంపెనీలకు వర్తించదని పేర్కొన్నారు. రుణమాఫీని నిర్ధారించేందుకు సహకార శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల వారిగా వివరాలను తీసుకొని డాటా రూపొందించనున్నారు.

జిల్లాలో మెజార్టీ రైతులకు వర్తింపు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ వల్ల జిల్లాలో మెజార్టీ రైతులకు మాఫీ కానుంది. జిల్లాలో లక్షా 85వేల మంది రైతుల వరకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఉన్నారు. వీరిలో దాదాపు 85 శాతంకు పైగా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. వీరందరికి ఐదు ఎకరాలలోపే ఎక్కువగా భూములు ఉన్నాయి. మిగతా రైతులకు ఆరు నుంచి ఇరవై ఎకరాలలోపు ఉన్న భూములు ఉన్నాయి. అంతకుమించి ఉన్న రైతులు కొద్దిమందే జిల్లాలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు డేటా ప్రకారం ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం సన్న, చిన్నకారు రైతుల రుణాలు 95 శాతానికి పైగా రెండులక్షల లోపే ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం వీరందరూ రుణాలు మాఫీ కానున్నాయి. జిల్లాలో మిగతా రైతులు కూడా రెండులక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారివి రెండు లక్షల వరకు ఈ రుణమాఫీ కానుంది. మిగతా రుణాన్ని మాత్రం రైతులు నేరుగా బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. రుణమాఫీకి సంబంధించి రెండు లక్షలకు పైగా ఉన్న రుణాన్ని చెల్లిస్తే ఈ రుణాన్ని మాఫీ చేస్తారు. రైతుల ఆధార్, బ్యాంకు ఖాతా, వ్యవసాయ పట్టాదారు పాస్‌బుక్, ఆహారభద్రత కార్డుల ద్వారా ఈ రుణమాఫీ లబ్ధిదారులను గుర్తించనున్నారు.

జిల్లాలో సుమారు రూ.1500 కోట్ల వరకు మాఫీ

జిల్లాలో రుణమాఫీ ద్వారా సుమారు 1500 కోట్ల రూపాయల వరకు మాఫీ అవుతుందని అంచనా వేస్తున్నారు. రైతులు సన్న, చిన్నకారుతో పాటు పెద్ద రైతులు ఉండటం వల్ల వారి రుణాలు సరాసరిగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత రుణాలు తీసుకున్న రైతుల వారిగా బ్యాంకు అధికారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జాబితాను సిద్ధం చేయనున్నారు. ఆ జాబితా ప్రకారం ఎన్ని కోట్లు జిల్లాలో మాఫీ కానుందో తెలియనుంది. ప్రభుత్వం చేసిన ఈ రుణమాఫీ వల్ల జిల్లాలోని మెజార్టీ రైతులకు మాత్రం ఉపయోగపడనుంది. రుణమాఫీ అయిన వెంటనే కొత్త రుణాలను కూడా రైతులకు అందించనున్నారు. మొదట రుణమాఫీ అయినట్లు రైతులకు సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు కొత్త రుణాలను అందిస్తారు. బ్యాంకుల వారిగా రుణమాఫీ జాబితాను సిద్ధం చేసిన తర్వాత ప్రభుత్వం నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నాయి. రైతుపేరు మీద ప్రభుత్వం తరపున డబ్బులను ఆయా బ్యాంకులకు ట్రెజరీ శాఖ ద్వారా చెల్లిస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని రైతులు స్వాగతిస్తుండగా ఆహార భద్రత కార్డు విషయంలో మాత్రం కొంత సంశయాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని రైతుల్లో కొంత మందికి ఆహారభద్రత కార్డులు లేవు. కొంత మంది దరఖాస్తు చేసుకున్న ఇప్పటి వరకు ఇవ్వలేదు. మరికొంత మందివి నిలిపివేశారు. బ్యాంకుల్లో ఉన్న పటాదారు పాస్‌పుస్తకం ఆధారంగా అందరికి రుణమాఫీ చేయాలని కొంత మంది సంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులందరూ అవసరాల కోసమే రుణాలు తీసుకున్నందున రెండు లక్షల లోపు రుణాన్ని మాఫీ చేయాలని కోరుతున్నారు.

ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంది..

: అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్



ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. హామీ మేరకు రుణమాఫీపై జీవోను విడుదల చేసింది. రెండులక్షల లోపు రుణాలు ఉన్న రైతుల మొత్తం రుణాన్ని మాఫీ చేస్తుంది. కొత్త రుణాలకు అవకాశం కల్పిస్తుంది. రైతులకు ఈ రుణమాఫీ ద్వారా భారం తీరడంతో పాటు కొత్త రుణాలు తీసుకునేందుకు అవకాశం వచ్చింది. అర్హులైన రైతులందరికీ ఈ రుణమాఫీ వర్తిస్తుంది.

సన్న,చిన్నకారు రైతులకు రుణమాఫీ మేలు ..

: భూపతిరెడ్డి, రైతు మంథని



ప్రభుత్వం రుణమాఫీపై తీసుకున్న నిర్ణయం సన్న, చిన్నకారు రైతులకు మేలు చేస్తుంది. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న ప్రతి రైతుకు వర్తింపజేయాలి. శరతులు విధించకుండా రెండు లక్షల వరకు మాఫీ చేయాలి. రైతు పట్టాను ప్రామాణికంగా తీసుకోవాలి.

ఐటీ పేరిట కొర్రీలు పెట్టొద్దు..

: గడ్డం గంగారెడ్డి, రైతు జైరాం



ప్రభుత్వం రైతులందరికి ఎలాంటి షరతులు విధించకుండా రుణమాఫీ చేయాలి. ఐటీ పేరుమీద కొర్రీలు పెట్టొద్దు. వాణిజ్య పంటలు పండించే ఎక్కువ మంది రైతులు ఐటీ పే చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రైతులందరికీ ఈ రుణమాఫీ వర్తింపజేయాలి. రుణమాఫీ వల్ల పేద, మధ్యతరగతి రైతులకు మేలు జరగనుతుంది.

హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించింది

● ఎంపీ ధర్మపురి అర్వింద్

పెద్దబజార్, జూలై 15: తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రావ్యగార్డెన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌పటేల్ కులాచారి బీజేపీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. రెండు ఎమ్మెల్యేలు స్థానాలను తిరిగి మళ్లీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకొని జిల్లాలో భారతీయ జనతాపార్టీ పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పటిష్టంగా ఉందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అత్యధికంగా జడ్పీటీసీ స్థానాలను గెలుచుకొని జిల్లా పరిషత్ చైర్మన్‌ను కైవసం చేసుకుంటామని అన్నారు. అలాగే అధికంగా సర్పంచులు, ఎంపీటీసీ స్థానాలు గెలుపొందడానికి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని అన్నారు. సంతలో కూరగాయలు కొన్నట్లు రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అర్ధరాత్రి పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల గురించి, రైతాంగ సమస్యల గురించి నిరుద్యోగ సమస్యల గురించి జిల్లాలో రాజకీయ పరిస్థితుల గురించి రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గంలో గెలుపొందిన ఎమ్మెల్యేల కంటే ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులు అధికారం చెలాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అభివృద్ధికి ఆటంకాలు కలిగించడానికి బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో గెలుపొంది నిజామాబాద్ మేయర్ సీటు కైవసం చేసుకోవడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రెండవసారి గెలుపొందడానికి బీజేపీని నమ్మి ఓట్లు వేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్ర



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్, పల్లెగంగారెడ్డి, లోకభూపతిరెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బద్దం లింగారెడ్డి, లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, గద్దెభూమన్న, స్రవంతిరెడ్డి, కంచెట్టి గంగాధర్, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం..

బూత్‌స్థాయి కార్యకర్తలకు అండగా ఉంటామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయం వద్ద కార్పస్ ఫండ్, బూత్‌స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 21 బూత్‌స్థాయి కార్యకర్తల కుటుంబాలకు 8లక్షల 80వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021 సెప్టెంబరు 17న నిర్మల్ సభలో కేంద్ర మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా కార్పస్ ఫండ్, బూత్‌స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధిని ప్రారంభించిన సంగతి తెలిసిందేనని అప్పటి నుంచి ఇప్పటి వరకు 186 మంది బూత్‌స్థాయి కార్యకర్తల కుటుంబాలకు సహాయం అందించడం జరిగిందన్నారు. కార్యకర్తలను ఆపదలో ఆదుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కోటగల్లి బాలికల పాఠశాలను పరిశీలించిన డీఈవో



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్ అర్బన్, జూలై 15: జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ పరిశీలించారు. కోటగల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చిన సందర్భంగా ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. సివిల్ సప్లై అధికారులు, మండల విద్యాశాఖ అధికారి రామారావుతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులను సైతం ఆయన హెచ్చరించారు. ఇదివరకే మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలని ఎంఈవోకు ఆదేశించిన డీఈవో సోమవారం సైతం ఏజెన్సీ మార్పు చేయాలని దానిపై నివేదిక అందజేయాలని ఎంఈవోను ఆదేశించినట్లు తెలుస్తుంది. జిల్లా విద్యాశాఖ అధికారి స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన నిర్వాహకుల్లో మాత్రం మార్పు రాలేదు. మళ్లీ అదే బియ్యాన్ని వండటంతో సోమవారం సైతం భోజనంలో పురుగులు వచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. పురుగులు ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు రిటర్న్ చేయాలని చెప్పినప్పటికీ నిర్వాహకులు వాటిని తిరిగి పంపకపోగా సోమవారం కూడా అదే బియ్యాన్ని వండటంతో భోజనంలో పురుగులు వచ్చినట్లు తెలుస్తుంది. మధ్యాహ్న భోజనం సక్రమంగా లేకపోవడంతో కొంత మంది విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకోవడం కనిపించింది.

అడుగంటిన మంజీరా

● జాడలేని వర్షాలు ● ఆకాశం వైపు చూస్తున్న రైతులు

కోటగిరి, జూలై 15: ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాలకు వరప్రదాయినిగా ఉన్న మంజీరా నదిలో నీటి ధార కరువైంది. వర్షాలు కురియక చుక్కనీరు రాక బోసిపోతోంది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులకు పైగా కావస్తున్న చినుకు జాడ లేక రైతాంగం ఆందోళన చెందుతోంది. రోజువారిగా నల్ల మబ్బులు కమ్ముకుంటుంటే రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురువకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంజీరా నదిలో నీటి ప్రవాహం కనుమరుగైంది. తీర ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయే పరిస్థితి నెలకొంది. అడపదడప కురిసిన వర్షాలకు వరినాట్లు వేసిన రైతన్న వర్షాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంజీరా నది గత ఏడాది ఈ సమయానికి వర్షాలు సమృద్ధిగా కురిసి వరద ప్రవాహం కొనసాగింది. వరదలతో భూగర్భ జలాలు పెంపొందాయి. రైతులు సైతం వేలాది ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం మంజీరా నదిలో నీరంత అడుగంటిపోయి ఏడారి ప్రాంతాన్ని తలపిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, బోధన్ డివిజన్‌లలోని పలు మండలాల్లో మంజీరా తీర ప్రాంత రైతులు వరిపంటను సాగు చేశారు. అడప దడప కురిసిన వర్షాలకు వరిపంటను సాగు చేసిన రైతులు వర్షాలు లేకపోవడంతో ఆకాశం వైపు చూస్తున్నారు. పంటలు ఎండుముఖం పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితులు కలవర పెడుతున్నాయి. మంజీర తీరంలో పదుల సంఖ్యలో ఎత్తిపోతల పథకాలు ఉన్న పని చేయని పరిస్థితి నెలకొంది. ఎత్తిపోతల పథకాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. తీర ప్రాంతంలో రైతులు బోరు బావులు తవ్వుకున్న భూగర్భజలం అడుగంటుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. గత ఆరు నెలలుగా మంజీర తీరంలో నీటి ప్రవాహం కరువైంది. ఇదే సమయంలో ఇసుక అక్రమార్కులు మంజీరా తీరంలో ఇసుకను కొల్లగొడుతున్నారు. విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని రైతులు కోరుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ సమస్యలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురియాలని ఆయా మండలాల్లో గ్రామ దేవతలకు జలాభిషేకాలు, పూజలు చేస్తున్నారు. వరుణ దేవుడు కరుణించాలని రైతులు వేడుకుంటున్నారు. వర్షాలు కురియకపోతే పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

వట్టిపోతున్న బోరుబావులు..

: గంధపు గంగారాం, రైతు, పొతంగల్



వర్షాలు లేకపోవడంతో మంజీరా నదిలో నీటి ప్రవాహం లేకుండా పోయింది. గత యేడాది ఈ పాటికి మంజీరా నది ప్రవహించడంతో పంటలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. భూగర్భ జలాలు పెరిగి రెండు పంటలు సమృద్ధిగా పండాయి. ప్రస్తుతం మంజీరాలో నీటి ధార లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే ఎండిపోయే పరిస్థితి తలెత్తింది.



● పొతంగల్ వద్ద మంజీరా నది ఇలా..



● హంగర్గ సమీపంలో ఎడారిలా మారిన మంజీరా నది

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జూలై 15 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా బాన్సువాడకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొయ్యగుట్ట చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని కొయ్యగుట్ట చౌరస్తా వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం కాసుల బాల్‌రాజ్ ఎమ్మెల్యే పోచారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరి ంచారు. కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పని ఇక ఖేల్ ఖతం దుకాణం బంద్ అయిందని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై 15 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు సోమవారం 14వ రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 101 మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, జూలై 15 : విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1, 3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 104మంది విద్యార్థులకు గాను 98 మంది పరీక్షకు హాజరయ్యారని ఆరుగురు విద్యార్థులు గైర్హాజ రయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు.

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

డిచ్‌పల్లి, జూలై 15 : మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని మొక్కల పెంపు అన్ని గ్రామాల్లో ఇళ్ల ముందు మొక్కలు నాటి పర్యా వరణ పరిరక్షణకు చేయూత అందించాలని ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, నడిపల్లి ఈవో నిట్టుకిషన్ రావులు కోరారు. సోమవారం గాంధీ నగర్ కాలనీలో 2వేల మొక్కలను ఇంటింటికి 3 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కలు నాటడమే గాకుండా వాటి సంరక్షణ కూడా చూసు కోవాలని కోరారు.

'నిత్యావసర సరకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలి'

డిచ్‌పల్లి, జూలై 15 : గత ఐదు నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, ఇక ముందు మధ్యాహ్న భోజనంకు సంబంధించిన కోడిగుడ్లు, నిత్యవసర సరకులు ప్రభుత్వమే అందించాలని, మధ్యాహ్న భోజన ప్రతినిధుల రాష్ట్ర ఉపాధ్యక్షు డు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాధికారి కార్యాలయంలో కార్మికులతో కలిసి ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు 10వేల రూ.వేతనంతో పాటు ఈ ఎస్ఐ, పీఎఫ్ సౌకార్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరకులు ఇస్తేనే తాము వంట చేస్తామని లేనిచో తమ సరఫరా చేసే స్థితిలో లేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బాలరాజు, సాయిలు, లక్ష్మీ, సులోచన, కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు సన్మానం

డిచ్‌పల్లి, జూలై 15 : గతకొన్నేళ్లుగా ధర్మారం (బీ) గురుకుల కళా శాల ప్రిన్సిపాల్‌గా, కో-ఆర్డినేటర్‌గా అత్యుతమ సేవలు అందించిన సంగీత మేడంను గురుకుల పేరెంట్స్ కమిటీ సభ్యులు సోమవారం సన్మానించి అభినందించారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన సంగీత ఈ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, నర్సయ్య, శ్రీనివాస్, నర్సయ్య, దీపక్, బూస బాలరాజు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్టోరియ మేడం అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

● సీడీపీవో సునంద

మద్నూర్, జూలై 15 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తుందని, అంగన్‌వాడీ వర్కర్లు రెండున్నర ఏళ్ళ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని మద్నూర్ ప్రాజెక్టు అధికారిణి సీడీపీవో సునంద సూచించారు. మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ర్యాలీ నిర్వహించి చిన్నారుల చేత మొక్కలను నాటించారు. మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ర్యాలీ నిర్వహించి చిన్నారుల చేత మొక్కలను నాటించారు. రెండున్నర సంవత్సరాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించడానికి లక్ష్యంగా వర్కర్లు పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కవిత, ఏఎన్ఎం స్వప్న తదితరులు ఉన్నారు.

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవీపేట, జూలై 15 : రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అన్వేష్‌రెడ్డికి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగా మండల మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌కే.బాబులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఆర్మూర్ టౌన్ : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. హైదరాబా ద్‌లోని అన్వేష్‌రెడ్డిని ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి, బండారిప్రసాద్ పాల్గొన్నారు.

మోర్తాడ్ : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అన్వేష్‌రెడ్డిని సోమవారం మోర్తాడ్ మండల కాంగ్రెస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మోర్తాడ్ వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు సుదీర్‌నాయక్, మండల రైతు సంఘం అధ్యక్షుడు బద్దం రాజశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, కొమిరె శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : అన్వేష్‌రెడ్డిని ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల సహకార యూనిట్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని కూడా కలిసి సన్మానించారు. ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్, జితేందర్ ఉన్నారు.

ఏర్గట్ల : సుంకేట్ అన్వేష్‌రెడ్డిని సోమవారం మండలంలోని కాంగ్రెస్ నా యకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, బద్ధం లింగా రెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, వెంకట్ రెడ్డి, రేండ్ల రమేష్ పాల్గొన్నారు.

చేపూర్‌లో వివాదాస్పద రోడ్డు స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



చేపూర్‌లో వివాదాస్పద రోడ్డును, స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై14 : చేపూర్ గ్రామంలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న వివాదస్పద రోడ్డు స్థలాన్ని సోమవారం ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. జంబిపూజకు గ్రామదేవతల ఆలయాలకు వెళ్లే రోడ్డును విజయ్ అనే వ్యక్తి కబ్జా చేశాడని గ్రామస్థులు అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రవికుమార్ చేపూర్ గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని గ్రామస్థులు ఏసీపీకి చూపించారు. గత ఏన్నో ఏళ్లుగా జంబిపూజకు, గ్రామదేవత ఆలయాలకు వెళ్లే రోడ్డును కబ్జా చేశారని గ్రామస్థులు ఏసీపీ వివరించారు. సర్వేయర్‌తో కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని, పరిసరాలను సర్వే చేయించారు. మూడు రోజుల్లోనే ఆర్డీవో, తహసీల్దార్‌ల సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్థులకు ఏసీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, వీడీసీ సభ్యులు శ్రీకాంత్, రుక్మాజీ, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నాగరాజు

ఆర్మూర్‌టౌన్ , జూలై 15 : యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా సిద్దాల నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడుతానని, రాష్ట్ర కమిటీ నాపై నమ్మకం ఉంచి కమిటీ సభ్యునిగా ఎన్నుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు.

ఒకటో వార్డులో బోరు పనులు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్ , జూలై 15 : మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు జిరాయత్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ బోరును మంజూరు చేసి సోమవారం బోరు పనులను ప్రారంభించారు. జిరాయత్ నగర్‌లో ప్రజలు నీటి సమస్యతో బాధపడుతున్నారని తెలియడంతో సోమవారం బోరుబావిని వేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఇంతియాజ్, రహమన్, ఫయాజ్, అతిక్, ఇందరపు రాజు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థిని



బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థి ధృవ

పెర్కిట్, జూలై 15 : ఆర్మూర్ పట్టణం మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి దాసరి ధృవ తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించినందుకు గాను తల్లిదండ్రులు రాజేందర్, నవత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్‌బెల్ట్ సాధించడానికి చాలా కఠోర శ్రమ చేశాడని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీన్, కుటుంబసభ్యులు ధృవను అభినందించారు.

ప్రైవేటు పాఠశాలకు మెమో జారీ

ముప్కాల్, జూలై 15 : పర్మిషన్ లేకుండా నర్సరీ తరగతులు నిర్వహిస్తున్న కిసాన్‌నగర్ సెయింటెన్స్ స్కూల్‌కు మెమో జారీ చేసినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పర్మిషన్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశారు. దీంతో స్కూల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉమ్మడి బాల్కొండ మండలంలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న స్కూళ్ళను మూసివేస్తామని హెచ్చరించారు.

బాల్కొండ పెద్ద చెరువు శిఖం కబ్జాను అరికట్టాలి



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ముప్కాల్, జూలై 15 : బాల్కొండ పెద్ద చెరువు శిఖం కబ్జా నుంచి కాపాడాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయలేదని, సర్వేయర్‌తో సర్వే చేపట్టి చెరువును రక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే పంట అధిక దిగుబడి



మాదాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిణి

జక్రాన్‌పల్లి, జూలై15: ముదిరిన వరినారు కొనలను తుంచి వేసి నాట్లు వేయడంతో పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారిణి దేవిక అన్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో ముదిరిన వరినారు కొనలు తుంచడంపై అవగాహన సదస్సు క్షేత్రస్థాయిలో నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారిణి దేవిక మాట్లాడుతూ ముదిరిన వరినారు తుంచడం వల్ల మొగిపురుగు రాకుండా నివారణ చేయవచ్చన్నారు. ముదిరిన నారు నాటినట్లయితే తక్కువ దూరంలో ఎక్కువ నారు నాటాలని రైతులకు అవగాహన కల్పించారు. వరి నారు పీకే వారం రోజుల ముందు 3జీ గుళికలు చల్లాలని, దీని వల్ల మొగిలిపురుగు నివారణ చేయవచ్చన్నారు. ఎరువులు మోతాదుకు మించి వాడవద్దన్నారు. అవసరమైన మేరకే ఎరువులను చల్లుకోవాలన్నారు. సరైన సమయంలో మందులు వరి పంటకు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారిణి సంధ్య, రైతు కూలీలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, జూలై15 :పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నపూర్ణ సాహిత నవనాథునికి గాజులతో అలంకరించారు. ప్రతీ సంవత్సరం అషాఢమాసం రెండో సోమవారం నవనాథునికి గాజులతో అలంకరించి గుట్టపై విచ్చేసిన మహిళా భక్తులకు అందజేస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు. సిద్దులగుట్టపై నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొని భక్తిపాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ప్రతీ సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించే అన్న ప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, ప్రశాంత్‌గౌడ్, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ఆలయ అర్చకుడు కుమారశర్మ, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్

ఆర్మూర్‌టౌన్, జూలై 15 : పట్టణంలోని రాంమందిర్ బాలుర హైస్కూల్‌లో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ సీజనల్ వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా, జపానీస్ ఎన్‌సెఫలైటిస్ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం రంగచారినగర్, అరుంధతీనగర్‌లో ఇంటింటికి సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ హెచ్‌వో కృష్ణమూర్తి, టి.శంకర్, శాంత, బట్టు ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలం, లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కీటకజనీత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాల వర్తింపు

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నందిపేట, జూలై 15 : రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా అర్హులైన లబ్ధిదారులకే పథకాలు వర్తిస్తాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పేదల తల్లిదండ్రుల ఆడపిల్లల వివాహాలకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకాలు ఏ కులానికో, మతానికో సంబంధించినవి కావని, నిబంధనల ప్రకారం అర్హులకే అందతుందని తెలిపారు. ఈ పథకాల వలన వరకట్న వేధింపులు తగ్గాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేనే షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఆపారని వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఉమ్మడి నందిపేట మండలానికి చెందిన 102 చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు భూతం సాయరెడ్డి, మండల తహసీల్ధార్ ఆనంద్‌కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, బీజేపీ నాయకులు ఎలిగేటి రాజు, గాండ్ల నర్సాగౌడ్, కుమ్మరి చిన్నయ్య, గంగాధర్ గౌడ్, రమేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడి టీచర్‌లు

భీమ్‌గల్ రూరల్, జూలై 15 : కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్ మున్సిపల్ కేంద్రంలోని బంజారా భవన్‌లో షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పెట్టిన కళ్యాణలక్ష్మీ రూ.లక్షతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన తులం బంగారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడున్న లబ్ధిదారులు అప్పులు చేసి పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు చేశారు. వారి తల్లిదండ్రులు వారికి తులం బంగారాం కూడా ఇస్తారనే ఆశతో వచ్చారని, వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఇచ్చిన రూ.లక్ష చెక్కుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు అందరికి తులం బంగారం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దొన్‌పాల్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మోర్తాడ్ : మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఆయన మొక్కలను నాటారు. మోర్తాడ్‌లో హరితహారం కార్యక్రమంలో కేసీఆర్ చేపట్టారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. హరితహారం కార్యక్రమం ద్వారా తెలంగాణలో అనుహ్యంగా గ్రీన్ కవరేజీ పెరిగిందని అన్నారు. గతంలో 22శాతం పచ్చదనం ఉండగా నేడు 31శాతానికి పెరిగిందని ఎమ్మెల్యే అన్నారు. మరో రెండు శాతం పెరిగితే తెలంగాణలో మంచి వర్షాలు పడతాయని గ్లోబల్ వర్మింగ్ కట్టడికి అస్కారం ఉందని అన్నారు. మొక్కలు నాటడం, సంరక్షించడం ప్రతీఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. నాటిన మొక్కలు పెరిగేందుకు బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు భవాని శంకర్, రవీందర్, ఎంపీడీవో తిరుమల, ఏపీవో శంకుతల, ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, చిరంజీవి, రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :మండలంలోని వివిధ గ్రామాలలో కుటుంబసభ్యులను కోల్పోయిన కుటుంబాలను సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడి పరామర్శించారు.. కమ్మర్‌పల్లిలో సంతరాజేశ్వర్‌ను, బీఆర్ నాయుకుడు హల్దే శ్రీనివాస్‌ను మాజీ కో-ఆప్షన్ సభ్యులు జాఫర్ హుసేన్ మరణంతో వారి కుటుంబసభ్యులను, తల్లి మరణంతో కోరె రాజన్న కుటుంబసభ్యులను పరామర్శించి 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తండ్రి చిన్నోజి మరణంతో బీఆర్‌నాయకుడు రాజీవ్‌గాంధీ కుటుంబసభ్యులను, కోతులదాడిలో బోడ్డు శంకర్ తల్లిందండ్రులు తీవ్రంగా గాయాలపాలై కోలుకుంటున్నవారిని పరామర్శించారు. హసాకొత్తూర్‌లో జంగం మహేష్‌ను, రాకేష్‌ను, రోడ్డుప్రమాదంలో భార్య ఆకుల తిరుమల, అనారోగ్యంతో తల్లి మరణంతో బషీరాబాద్ గ్రామానికి చెందిన ఆకుల లింగన్న వారి కుటుంబసభ్యులను ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడి వెంల మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం రాజేశ్వర్, బద్రి, బద్దం చిన్నారెడ్డి, కోరె నర్సయ్య, గడ్డం శ్రీధర్, విజయ్, కొమ్ముల రాజజేందర్, రాజాగైడ్, మరీష్ రెడ్డి, వేముల శ్రీనివాస్, తదితర బీఆర్ఎస్ నాయకులు కార్యక్తలు ఉన్నారు.

వేల్పూర్ : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం అయ్యేలా చూడాలని సోమవారం వేల్పూర్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని అంగన్‌వాడీ టీచర్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. అం గన్‌వాడీ టీచర్‌ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వివిధ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్ళాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కోరారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో రాళ్లు



బియ్యంలో వచ్చిన రాళ్లు

నవీపేట, జూలై 15 : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించి సరఫరా అయిన బియ్యంలో అధిక మొత్తంలో రాళ్లు వస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా కాగా అందులో రాళ్ళు, మెరిగెలతో పాటు ఎలుకలకు సంబంధించిన వ్యర్థాలు బయట పడుతున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. మధ్యాహ్నభోజన సమయంలో బియ్యంలో రాళ్లు, మెరిగెలను ఏరివేసి వండుతున్నప్పటికీ అక్కడక్కడ విద్యార్థులకు వండిన అన్నంలో రాళ్లు వస్తున్నాయని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావును వివరణ కోరగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో రాళ్లు, మెరిగెలు వస్తున్నాయనే విషయం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత బియ్యాన్ని వాపసు పంపిస్తున్నామన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయలు



తీవ్రంగా గాయపడిన నవీన్

నవీపేట, జూలై 15 : మండలంలోని ధర్మారం మూలమలుపు సమీపంలో సోమవారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో తండ్రీ కూతురుకు గాయాలయ్యాయి. నవీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, అతని 10 సంవత్సరాల కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన నవీన్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని, ఉదయం 9:30గంటల సమయంలో బైక్‌పై తన కూతురును వెంట తీసుకుని వెళ్తుండగా అబ్బాపూర్(ఎం) దాటిన తర్వాత ధర్మారం మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా అతని కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ బైక్ వేగంగా ఉండడంతో అతని తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు



పడిగెలలో విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సభ్యులు

వేల్పూర్, జూలై 15 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ యువనైపుణ్య దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు రెండు గ్రూప్‌లుగా వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువు ఒక్కటే కాకుండా అదనంగా వివిధ అంశాల్లో నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు. రెండు విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, హెచ్‌ఎం రాంచందర్, కోశాధికారి నారాయణగౌడ్, ప్రాజెక్టు ఛైర్మన్ అంబల్ల తిరుపతి, కో-ప్రాజెక్టు ఛైర్మన్‌చావుల పాల్గొన్నారు.

రుద్రూరు : మండల కేంద్రంలోని అంబం (ఆర్) గ్రామశివారులో గల ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజం చైతన్యం కోసం విద్యార్థి ని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత నైపుణ్యాలను పెంచుకుని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. ర్యాలీలో కళాశాల అధ్యాపకులు దుర్గాప్రసాద్, శ్రావణి, సతీష్, డాక్టర్ శివకృష్ణ, రమేష్, కుల్దీప్‌సింగ్, పీడీ రవి, మౌనిక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మానవ మనుగడకు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని మన జీవన ప్రమాణాల ఇవీ ఎంతగానో ఉపయోగపడుతాయని జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలోని ప్రపంచ జాతీయ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిది



మొక్కలు నాటుతున్న పోలీసులు

బోధన్‌రూరల్, జూలై 15 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. సోమవారం బోధన్ మండలంలోని మందర్నా గ్రామంలో ప్రతి ఇంటికి చెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఖాళీస్థలాల్లో 200 చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రావుబా గంగాధర్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఏరాజ్‌పల్లి తదితర గ్రామాలలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు.

'ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

బోధన్‌రూరల్, జూలై 15 : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపర్చాలని, ఇచ్చిన వాగ్దానాలు పూర్తయ్యేవరకు ఉద్యమించాలని ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద గల పాన్‌గల్లీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేంత వరకు ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, బీడీ కార్మికులకు పింఛన్‌లు, కొత్త రుణాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదిన మహలక్ష్మి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ఉంటుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సాయిలు, పోశెట్టి, గంగారాం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి ఒకరోజు జైలు

బోధన్‌రూరల్, జూలై15 : వాహనాలను మద్యం సేవించి నడపవద్దని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సోమవారం బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శేషాతల్ప సాయి మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 1500రూపాయల జరిమానతో పాటు ఒకరోజు జైలుశిక్షను విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అనంతరం 11 మంది పేకాట రాయుళ్లకు 27,500 రూపాయల జరిమాన విధించినట్లు ఆయన తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల ఏర్పాట్లపై పరిశీలన

బోధన్‌రూరల్,జూలై15: బోధన్ పట్టణంలోని రాకాసిపేటలోని స్టేషన్‌లో సోమవారం రైల్వేశాఖ అసిస్టెంట్ డివిజినల్ రైల్వే మేనేజర్ తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో వసతుల ఏర్పాట్లపై ఆవరణను పరిశీలించారు. అనంతరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బోధన్ నుంచే ప్రారంభించాలని విద్యార్థి సంఘాల నాయకులు మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించడం జరిగిందని, పూర్తినివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. బోధన్ నుంచి రాయలసీమకు రైలు సౌకర్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. త్వరలోనే బోధన్‌వాసుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆయన వెంట రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించిన ఎంపీడీవో

రెంజల్,జూలై15: మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో పనులు చేపడుతుందని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు మొదలై నెలలు గడుస్తున్నా పనులలో జాప్యం చేయడం సమంజసం కాదని సూచించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ రాజయ్య, ఏఈ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో నర్సరీని సందర్శించిన ఎంపీడీవో

రెంజల్,జూలై15: మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల నర్సరీని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో రమణతో కలిసి సందర్శించారు. నర్సరీలోని మొక్కలను సంరక్షించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఐదుమొక్కలను నాటాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండగ

ఏర్గట్ల, జులై 15: మండల కేంద్రంలో సోమవారం హిందూ ముస్లీంలు పీర్ల పండగలను భక్తి శ్రద్ధతో జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట పీర్లను ఊరేగించగా భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను ఎత్తుకొని డప్పుచప్పుల్లతో దూలా ఆడారు. కార్యక్రమంలో గ్రామంలోని ముస్లీంలతో పాటు హిందువులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలోకి చేరిక

ఏర్గట్ల, జులై 15 : పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సమక్షంలో సోమవారం మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. మాజీ ఉపసర్పంచ్ దేశబోయిన సంజీవ్ యాదవ్, ఎర్రాజీ ప్రవీణ్, పడాల మహేష్‌తో పాటు పలువురికి ఎంపీ అర్వింద్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమ రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ బొల్లిశంకర్, బద్ధం సురేష్ రెడ్డి, సోమనరేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్, జూలై 15 : మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలోని చెరువులో సోమవారం ఉదయం మృతదేహం లభించినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జాడి జమాల్‌పూర్ గ్రామానికి చెందిన వన్నెల వెంకటేష్ (31) అనే వ్యక్తి శనివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం ఉందని గ్రామస్థులు తెలుపగా వెళ్లి చూడగా మృతదేహం తమ కుమారుడిదేనని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వెంకటేష్ 9సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, అప్పుడే విడాకులు అయ్యాయని, అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం

ముప్కాల్, జూలై15 : మండలంలోని వేంపల్లి గ్రామంలో ఆదివారం ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సాంబారు లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్ళడంతో ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులను ఆయనను శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. సాంబారు నారాయణ గత 11ఏండ్లుగా తమ సేవలను పాఠశాలకు అందించి ఎంతో మంది విద్యార్థులను గురుకుల పాఠశాలలకు పంపించే విధంగా కృషిచేశారని, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్మూర్ మండలం రాంపూర్ పాఠశాలలకు బదిలీపై వెళ్ళారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ రామకృష్ణ యాదవ్, మాజీసర్పంచ్ బార్ల అంజయ్య, గణేష్, సుమన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్; సతీష్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, విద్య కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌ను కలిసిన జిల్లా మైనార్టీ వర్కింగ్ చైర్మన్

కమ్మర్‌పల్లి, జూలై 15: తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌ను జిల్లా మైనార్టీ వర్కింగ్ చైర్మన్ అబ్దుల్ రఫీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాలమోహన్ రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు చైర్మన్‌లను కలిసిన వారిలో జిల్లాకు చెందిన వివిధ మండలాల మైనార్టీ నాయకులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్, జూలై 15: న్యాయమైన రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్ల జేఏసీ నాయకుడు రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పలుసార్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా ఫలితం రాని కారణంగా విసిగి రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతన్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అయినా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నర్సింహస్వామి, సుదర్శన్, శాంతాబాయి, గంగారాం, నారాయణ, పూర్ణచందర్‌రావు, హైమద్, వీరయ్య పాల్గొన్నారు.

'ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, జూలై 15: భవన నిర్మాణ అనుమతి కోసం నకిలీ ఎల్ఆర్ఎస్ సృష్టించి మోసం చేసిన ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం బాధితురాలు విజయ ఫిర్యాదు చేశారు. భవన నిర్మాణం అనుమతి కోసం ఇంజనీర్‌ను సంప్రదించగా టీఎస్ బిపాస్ కోసం 3లక్షల రూపాయలు తీసుకొని అనుమతి ఇప్పించాడని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి నోటీసు వచ్చిందని 3లక్షల రూపాయలకు కేవలం లక్షా 96వేల 208 రూపాయలు ప్రభుత్వ రుసుము చెల్లించి మిగిలిన మొత్తాన్ని దుర్వినియోగం చేశాడని తెలిపారు. నకిలీ ఎల్ఆర్ఎస్ సృష్టించి సంతకాలు ఫోర్జరి చేశాడని తెలిసిందని అన్నారు. నోటీసును తనకు తెలియకుండానే సంతకం పెట్టి జవాబు ఇచ్చారని అన్నారు. నోటీసును క్లోజ్ చేయడానికి 50వేలు ఇవ్వాలని తెలిపారు. అతన్ని నమ్మి మరో 50వేలు కూడా ఇచ్చామని అన్నారు. పని జరగకపోవడంతో రెండు మూడు రోజుల్లో 50వేలు తిరిగి ఇచ్చేశాడన్నారు. మొత్తం రుసుము 2లక్షల 15వేల 840రూపాయలు చెల్లించాలని అంటున్నాడని ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లా, జూలై 15: నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన పెద్దన్నపై హత్యాయత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన సాయరెడ్డి, తదితరులపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో సాయరెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో ఉన్న పెద్దన్నను గత కొన్ని రోజులుగా పంట వేసుకోకుండా మానసికంగా ఇబ్బందులు పడేలా చేశారని అన్నారు. పొలంకు దారి విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవ జరుగుతుందని న్యాయం కోసం కోర్టును సైతం ఆశ్రయించారని అన్నారు. జూన్ 25న పెద్దన్నపై దాడికి యత్నించగా తొమ్మిది చోట్ల పక్కటెముకలు, రెండు చోట్ల వెన్నుపూస విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురిపై అత్యాయత్నం కేసు నమోదు చేశారని తెలిపారు. అసలు అత్యాయత్నానికి కారణమైన సాయరెడ్డిపేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదన్నారు. దాడికి కారణమైన సాయరెడ్డిపై కేసు నమోదు చేయాలని పెద్దన్నకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

పెద్దబజార్, జూలై 15: నగరంలోని కోటగల్లిలోగల బంగారు మైసమ్మ ఆలయంలో తొమ్మిదిరోజులుగా వారాహి అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం చివరి రోజు సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢమాంలో కోటగల్లిలో వారాహి అమ్మవారి ఉత్సవాలు జరుపుకోవడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలకు అమ్మవారి దీవెనలు ఉండాలని సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతిరెడ్డి దేవేందర్, ఆలయ కమిటీ కన్వీనర్ ధర్మపురి పల్నాటి కార్తిక్, హరీష్‌రెడ్డి, హరీష్, భాస్కర్, సతీష్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన నియామకం

నిజామాబాద్ అర్బన్, జూలై 15: యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన పెద్దిసూరి నియమితులయ్యారు. ఈనెల 14న నిర్వహించిన రాష్ట్ర ప్లీనరీలో రాష్ట్ర కార్యదర్శిగా సూరిని నియమించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ప్రజాసంఘ క్రమశిక్షణ పాటిస్తూ నియమనిబద్ధలతో పనిచేసేటువంటి కార్యకర్తలకు రాష్ట్ర కమిటీ ప్రాధాన్యత ఇస్తుందని ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాలోని విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కమిటీకి, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మోపాల్, జూలై 15: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు సాయాగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కరపత్రాల ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, శేఖర్, రాములు, చిన్న గంగమళ్ల, పర్వన్న, పోశెట్టి, సాయిలు తదితరులు ఉన్నారు.

'ప్రజావాణి'కి 91 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, జూలై 15: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవో చక్రవర్తుల తరుణ్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాపాలన సేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్..

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ జోన్-4లోగల కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ వద్ద కొనసాగుతున్న ప్రజాపాలన సేవ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం తనిఖీ చేశారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించగా పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాలు పొందలేకపోతున్న అర్హులైన వారికి లబ్ధిచేకూరాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజాపాలన సేవ కేంద్రాలను కొనసాగిస్తుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న లోపాలను సవరించి పరిష్కారానికి ఆస్కారం ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. సాంకేతిక సమస్యలతో కూడిన దరఖాస్తుల సమగ్ర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఈ-డిస్ట్రిక్ మేనేజర్ కార్తిక్, తదితరులు ఉన్నారు.

జిల్లాలో కురుస్తున్న మోస్తరు వర్షాలు



నగరంలో కురుస్తున్న వర్షం



మెండోరలో భారీగా కురుస్తున్న వర్షం

నిజామాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. జిల్లాలో సోమవారం సరాసరి 5.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని నిజామాబాద్ సౌత్ మండలంలో 14.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 33 మండలాల పరిధిలో జూన్ నుంచి ఇప్పటి వరకు 274.9 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 228.1 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 2 మండలాల్లో సాధారణ సగటు కంటే ఎక్కువ వర్షం పడగా 16 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 15 మండలాల్లో సాధారణ సగటు కంటే తక్కువ వర్షం పడింది. వానాకాలం మొదలై 45 రోజులు గడిచినా ఇప్పటికి భారీ వర్షం పడలేదు. జిల్లాలోని వాగులు ఇంకా పొంగలేదు. మెజార్టీ చెరువుల్లోకి నీళ్లు రాలేదు. వర్షాలు ఎక్కువగా పడకపోవడం వల్ల ఇప్పటి వరకు జిల్లాలోని ఏ చెరువుల్లో కూడా అలుగులు పారలేదు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న స్వల్ప ఇన్‌ఫ్లో..

ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో స్వల్పంగా వరద వస్తుంది. ప్రాజెక్టులోకి 3831 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1062.50 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 13.78 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

చిన్నపాటి వర్షానికే నగర రోడ్లు జలమయం

సుభాష్‌నగర్: చిన్నపాటి వర్షానికే నగరంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్ ముందర రోడ్డుపై నీరు భారీగా ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలోని ప్రధాన రోడ్డు కవితా కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వరకు పూర్తిగా రోడ్డు నీటితో మునిగిపోయింది. మోకాళ్లలోతు నీరు ప్రవహించేసరికి వాహనాలు సగం వరకు నీటిలో మునిగిపోయాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం కావడం పట్ల నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంటూ భారీగా ఖర్చు చేసిన ప్రభుత్వం రోడ్లపై నీళ్లు నిలువకుండా చూడలేకపోయింది. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





చిన్నపాటి వర్షానికే నగరంలో జలమయమైన రోడ్లు

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

పెద్దబజార్, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్ అన్నారు. సోమవారం నగరంలోని గాంధీచౌక్ నుంచి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు అందజేసి ఆయన ఇంటి నుంచి ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ సమస్యలపై మాట్లాడుతానని అవసరమైతే అసెంబ్లీ ముందు సమస్యలపై ధర్నా చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను 65 సంవత్సరాలు పూర్తయిన వారికి అతితక్కువ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ ఇంటికి పంపుతూ ఇచ్చిన జీవో 10ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తక్కువ బెనిఫిట్స్ ఇచ్చి అన్యాయంగా తొలగించడానికి వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి స్వర్ణ, సూర్యకళ, సరిత, జరీనా, సునీత, సునంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మోపాల్, జూలై 15: విద్యార్థులు కష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నతమైన స్థాయికి వెళ్తారని ఉపాధ్యాయులు సూచించారు. సోమవారం మోపాల్ మండలం ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్‌లో అన్నె బసవయ్య స్మారక చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లినప్పుడు పాఠశాలను మర్చిపోవద్దని మనకు జీవితాంతం గుర్తుండేవిధంగా పేద విద్యార్థులకు సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవింద్, ఉదయ్‌భాస్కర్, వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గణపతి, దండునర్సయ్య, అగ్గు చిన్నయ్య, గోవర్ధన్, రవీందర్, రవి, నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

ఇందల్వాయి, జూలై 15: మండలంలోని చంద్రయాన్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ముగ్గురు టీచర్లను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన టీచర్లు రాధిక, పుష్పలత, కృష్ణవేణి, శారదలు గత నాలుగు సంవత్సరాల నుంచి చంద్రయాన్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ప్రమోషన్ బదిలీపై వెళ్తున్నందున సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఇన్నాళ్లుగా మంచి విద్యాబుద్ధులు నేర్పి బదిలీపై వెళ్తున్న సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో ఘనంగా వీడ్కోలు పలికారు. కొందరు విద్యార్థులు తమ టీచర్లు వెళ్తున్నందున కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు విధుల్లో భాగంగా బదిలీలు తప్పవని ప్రతి ఒక్కరి జీవితంలో సర్వసాధారణమని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్న బాలయ్య, సభ్యులు రాజాగౌడ్, భూమయ్య, రాజన్న, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది సంజీవ్, వనజ, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ, జూలై 15: సీజనల్ వ్యాధులపై అప్రమత్తతగా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని మండల వైద్యాధికారి అరవింద్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని న్యావనంది, సిరికొండ హైస్కూళ్లతో పాటు సత్యశోదక్ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చిందంటే పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు దరిచేరకుండా దోమతెరలు వాడాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, మెదడు వాపు లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్యాధికారి వివరించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే స్థానిక వైద్యాధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సతీష్‌కుమార్ గౌడ్, శ్రీనివాస్, నర్సయ్య, వైద్యసిబ్బంది తబిత, రమేష్ స్వరూప, ఝాన్సీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అన్వేష్‌రెడ్డి

చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 15: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మాజీ విప్ ఈరవత్రి అనిల్, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి హాజరయ్యారు.


విధి నిర్వహణలో మన్ననలు పొందడం గొప్ప విషయం



హోంగార్డ్‌ను సన్మానిస్తున్న సీపీ కల్మేశ్వర్‌శింగనేవార్

ఖిల్లా, జూలై, 15: విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనే వార్ అన్నారు. హోంగార్డ్ వి.గంగారెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం వీడ్కోల్ సన్మాన కార్యక్రమాన్ని ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో ఎటువంటి రిమార్క్‌లేకుండా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పదవి విరమణ చేసిన సిబ్బంది కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఏఆర్.శంకర్‌నాయక్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ హోంగార్డ్ విభాగం హెచ్.సతీష్, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రసవాల కోసం ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి



డీఎంఅండ్‌హెచ్‌వోను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 15: సాధారణ ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక చంద్రశేఖర్ కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో తల్లి మరియు పిల్లల సంరక్షణ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు జి.హరికృష్ణ, క్లబ్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కోశాధికారి భరత్ పటేల్, సభ్యులు శ్రీకాంత్ జవహర్, తులసీదాస్ పటేల్, ఆకుల అశోక్, జ్ఞాన ప్రకాష్, నర్సింగ్‌రావు, పీఎఫ్‌సీ డాక్టర్ రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో శుభ్రతను పాటించాలి

సుభాష్‌నగర్, జూలై 15: నగర పాలక సంస్థ పరిధిలోని విద్యాసంస్థల్లో శానిటేషన్ విభాగం నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్‌ను పొందేందుకు పరిశుభ్రతను పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మందమకరంద్ అన్నారు. విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో పారిశుధ్య సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాసంస్థల యజమానులు మరుగుదొడ్ల శుభ్రత పాటించాలని కోరారు. బాలికలు, బాలుర కోసం వేరువేరుగా మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ధర్పల్లి, జూలై 15: యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై విక్రమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాబృందం సభ్యులు పాటలు, నృత్యాలు, నాటకాల రూపంలో అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రోడ్డు నియమాలు పాటించాలని, షీటీమ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేయడం జరుగుతుందని, అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని, మూఢనమ్మకాలు, సీసీ కెమెరాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ ఏజెంట్లు, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాజేంద్రప్రసాద్, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రసాహెబ్, కళాబృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	రూ.125	రూ.235	రూ. 255

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,600	రూ.67,800	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
: కల్కి(హిందీ) (2.45, 10.15)
స్ర్కీన్-2 : భారతీయుడు-2 (11.15, 3.00, 6.45, 10.30)
స్ర్కీన్-3 : కిల్ (హిందీ) (12.15, 2.45, 9.00)
: భారతీయుడు-2 (5.15)
స్ర్కీన్-4 : సర్ఫిరా (హిందీ) (12.20, 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : భారతీయుడు-2 (9.00, 12.30, 4.00, 7.25, 10.50)
స్ర్కీన్-2 : భారతీయుడు-2 (10.00)
: కల్కి(తెలుగు) (1.30, 3.20)
: కల్కి(3డి తెలుగు) (6.45)
స్ర్కీన్-3 : కల్కి(తెలుగు) (10.30, 1.30, 3.20, 7.00, 10.40)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్